


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 24-10-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 48 సంచిక : 39 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## దుర్గాఘాట్‌లో మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల తెప్పోత్సవం



విజయవాడ, (విజయభాను న్యూస్) : దుర్గాఘాట్‌లో మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తుల తెప్పోత్సవంలో భాగంగా స్వామి కృష్ణానదిలో హంసవాహనం జలవిహారం చేస్తున్నారు. మూడు మార్లు ఉత్సవవిగ్రహాలకు జలవిహారం చేయించనున్నారు. దుర్గాఘాట్ నుంచి ప్రారంభమైన తెప్పోత్సవాన్ని చూడటానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. హంసవాహనం పైనకేవలం 31 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు.

మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల మధ్య తెప్పోత్సవం జరుగుతోంది. మూడేళ్ల తర్వాత భక్తులకు స్వామివారు నదీవిహారం చూసే భాగ్యాన్ని కల్పించారు. ఈ తెప్పోత్సవ కార్యక్రమంలో బాణా సంచా సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గాఘాట్‌తో పాటు ప్రకాశం బ్యారేజ్ నుంచి తెప్పోత్సవాన్నిభక్తులు వీక్షించారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం.. కోస్తాలో వర్షాలు!



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** :పశ్చిమ బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైనట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది క్రమంగా తుపానుగా, అనంతరం తీవ్రతుపానుగా మారే అవకాశాలున్నట్లు పేర్కొంది. అక్టోబర్ 25న బంగ్లాదేశ్‌లో తీరం దాటే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ వాయుగుండం కారణంగా కోస్తాలో రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.




## 'సమిష్టి కృషి, సమన్వయంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం'



తిరుపతి: సమిష్టి కృషి, సమన్వయంతో శ్రీవారి సాలకట్ల మరియు నవరాత్రి రెండు బ్రహ్మోత్సవాలు విజయవంతమైనట్లు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఇవాళ ఉదయం స్థానిక అన్నమయ్య భవనంలో భూమన కరుణాకరరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు..శ్రీవారి కృపతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం చేశామని... భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. వాహన సేవల్లో ఉత్సవాలు చేసిన భక్తులు మధురానుభూతి పొందారన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లోనే టీటీడీ ఉద్యోగుల కల నెరవేరిందని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగులకు ఇంటి స్థలాలను అందాజేశామన్నారువాహన సేవల ముందు కళ బృందాలు గొప్పగా తమ ప్రదర్శనలు చేశాయని,15 రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక కళా బృందాలు భక్తులను అలరించాయన్నారు. ఉత్సవాలు ఘన విజయం కావడానికి శ్రమించిన ప్రతిఒక్కరికి చైర్మన్ అభినందనలు తెలియజేశారు.

హిందూ ధార్మిక వ్యాప్తి, హైందవ ప్రజాహితం కోసం టీటీడీ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

### మహారాష్ట్రలో భారీగా డ్రగ్స్ పట్టివేత

మహారాష్ట్ర: మహారాష్ట్రలో డీఆర్ఐ అధికారులు భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకొన్నారు. ఛత్రపతి శంభాజీనగర్‌లో 23 కేజీల కొకైన్, 2.9 కేజీల మెఫెడ్రోన్‌తో పాటు ఒక నిందితుడి ఇంటి నుంచి 30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. మాదక ద్రవ్యాల తయారీకి ఉపయోగించే 704 కిలోల మెఫెడ్రోన్‌ను సీజ్ చేశారు. మార్కెట్లో దీని విలువ 1400 కోట్లు పైబడి ఉంటుందని అంచనా వేశారు. ఔషధాల ముసుగులో మాదక ద్రవ్యాలు తయారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దేశ ఆర్థిక రాజధాని ముంబయి వెలుగులోకి వచ్చిన ఘటన సంచలనం సృష్టించింది.

## గగన్‌యాన్‌కు మహిళా టెస్ట్ పైలట్లు కావాలి

### భవిష్యత్‌లో వారు అందుబాటులోకి వస్తారు: ఇస్రో ఛైర్మన్



తిరువనంతపురం: మానవసహిత గగన్‌యాన్ ప్రాజెక్టులో పాలుపంచుకునేందుకు మహిళా ఫైటర్ టెస్ట్ పైలట్లు అవసరమని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు. వారిని భవిష్యత్‌లో అంతరిక్షంలోకి పంపుతామని చెప్పారు. వచ్చే ఏడాది మానవరహిత గగన్‌యాన్ వ్యోమనౌకలో మహిళా హ్యూమనాయిడ్ రోబోను పంపిస్తామన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం వ్యోమగాములను నేల నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి పంపి, అక్కడ మూడు రోజులపాటు వారిని ఉంచి తిరిగి భూమికి తీసుకురావడం. ఈ ప్రాజెక్టులో మహిళలను భాగం చేస్తామని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ చెబుతూ "ఆ విషయంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అర్హులైన మహిళా అభ్యర్థులు దొరకాలి. ప్రస్తుతానికి వైమానిక దళానికి చెందిన ఫైటర్ టెస్టు పైలట్లను వ్యోమగాములుగా ఎంపిక చేస్తున్నాం. అయితే మహిళా ఫైటర్ టెస్టు పైలట్లు మన వద్ద లేరు. భవిష్యత్‌లో వారు అందుబాటులోకి వస్తే అతివలను రోదసిలోకి పంపడానికి మనకు ఒక మార్గం సుగమమవుతుంది. అంతరిక్షంలో మన శాస్త్రీయ పరిశోధనలు ముమ్మరమయ్యాక రెండో అవకాశం అందుబాటులోకి వస్తుంది. ఆ పరిస్థితుల్లో శాస్త్రవేత్తలే వ్యోమగాములవుతారు. ఈ రూపంలో మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయి" అని సోమనాథ్ పేర్కొన్నారు. 2035 కల్లా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించే భారతీయ స్పేస్ స్టేషన్‌ను అంతరిక్షంలో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం : 15 మంది మృతి

ఢాకా : బంగ్లాదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. కిషోర్‌గంజ్‌లో ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందగా, 100 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రోజున రాజధాని ఢాకాకి 80 కిలోమీటర్ల దూరంలో భైరబ్ వద్ద జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజధాని ఢాకాకు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న భైరబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసు అధికారి సిరాజుల్ ఇస్లాం తెలిపారు. రైలు కింద పలువురు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చాలా మంది కోచ్‌ల కింద పడి ఉన్నారని.. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని తరలించడంలో స్థానిక ప్రజలు కూడా సహాయం చేస్తున్నారు.




# నవంబర్ 1న ఉమ్మడి కార్యాచరణ



రాజమహేంద్రవరం: వైకాపా పాలనలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ ప్రభుత్వాన్ని కచ్చితంగా ఇంటికి పంపాల్సిన అవసరం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. వైకాపా నేతలు అన్ని పార్టీల నాయకుల్నీ ఇబ్బంది పెడుతున్నారన్నారు. వైకాపా వ్యతిరేక ఓటు చీల్చనివ్వబోనని గతంలోనే చెప్పానని, రాష్ట్ర అభివృద్ధే జనసేన పార్టీకి ముఖ్యమని పవన్ తెలిపారు. తెదేపా-జనసేన సమన్వయ కమిటీ భేటీ ముగిసిన అనంతరం లోకేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "మద్యనిషేధం చేస్తామని చెప్పి వైకాపా ప్రభుత్వం విచ్చలవిడిగా అమ్ముతోంది. ఈ రాష్ట్రానికి వైకాపా అనే తెగులు పట్టుకుంది. ఆ తెగులు పోవాలంటే.. తెదేపా - జనసేన వ్యాక్సిన్ అవసరం. చంద్రబాబును అక్రమంగా అకారణంగా జైల్లో పెట్టారు. సాంకేతిక అంశాల పేరుతో బెయిల్ రాకుండా చేస్తున్నారు. చంద్రబాబుకు మద్దతిచ్చేందుకే రాజమహేంద్రవరంలో భేటీ అయ్యాం. ప్రజలకు భరోసా ఇచ్చేందుకే మేం కలిశాం. ఉమ్మడి మ్యానిఫెస్టో ఎలా ఉండాలనే దానిపై చర్చించాం. తెదేపా-జనసేన ఎలా కలిసి పని చేయాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించాం. త్వరలో కనీస ఉమ్మడి ప్రణాళిక ప్రకటిస్తాం" అని పవన్ అన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికే ఈ భేటీ: లోకేశ్

విజయదశమి రోజు తెదేపా-జనసేన సమావేశం కావడం రాష్ట్రానికి మేలు చేస్తుందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి వెళ్లాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నామన్నారు. "వైకాపా పాలనలో బీసీ వర్గాలను వేధిస్తున్నారు. బీసీలకు రావాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారు. ఎస్సీలకు రావాల్సిన 26 సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారు. వైకాపా నేతల వేధింపులతో ముస్లిం సోదరులు ఆత్మహత్య చేసుకున్నారు" అని లోకేశ్ అన్నారు. ఉద్యోగాలు లేక యువత పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని లోకేశ్ అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని పలురకాలుగా వేధిస్తున్నారని మండిపడ్డారు. "సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వ చేతకానితనం కనిపిస్తోంది. నాలుగేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. వ్యవస్థలను మేనేజ్ చేసి ప్రతిపక్ష నేతల గొంతు నొక్కేస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే రెండు పార్టీల నేతలం భేటీ అయ్యాం" అని లోకేశ్ అన్నారు.

### నవంబర్ 1న ఉమ్మడి కార్యాచరణ

నవంబర్ 1న ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని లోకేశ్ అన్నారు. ఓటరు జాబితాపై అక్రమాలపై క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా పరిశీలిస్తామన్నారు. "వందరోజుల కార్యాచరణ ప్రకటించాం. నవంబర్ 1 నుంచి మ్యానిఫెస్టో ప్రకటించి ప్రచారం ప్రారంభిస్తాం. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తాం. ఈ సమావేశంలో మూడు తీర్మానాలు చేశాం.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఒక తీర్మానం, అరాచక వైకాపా పాలన ఉంచి ప్రజలను రక్షించాలని మరొకటి, రాష్ట్రాభివృద్ధి కోసమే కలిసి పోరాటం చేయాలని మూడో తీర్మానం చేశాం" అని లోకేశ్ అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత తెదేపా-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అమ్మవారి పండగ నిర్వహణకు సహకరించండి

## - విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు

విజయనగరం : విజయనగరం పట్టణ యువత, శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులతో విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు అక్టోబరు 23న హుకుంపేటలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ - శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం, సిరిమాను తరలింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. సిరిమాను తరలింపు సకాలంలో జరిగితే, సిరిమాను ఊరేగింపు నిర్దిష్ట సమయంలోగా పూర్తవుతుందన్నారు. కావున, కమిటీ సభ్యులు, యువత సకాలంలో సిరిమాను తరలింపుకు సహకరించి, వివిధ ప్రాంతాల నుండి పండగను వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలీసులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేస్తే, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టవచ్చునన్నారు. సిరిమానోత్సవం రోజున భక్తులు సిరిమాను తరలింపుకు ముందే పూజలు పూర్తి చేసుకొనే విధంగా చూడాలని కమిటీ సభ్యులకు డిఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. పండగ నిర్వహణపై కమిటీ సభ్యులతో పలు అంశాలపై డిఎస్పీ ఆర్.గోవిందరావు, 2వ పట్టణ సిఐ విజయ ఆనంద్ చర్చించి, పండగ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా కమిటీ సభ్యులతో సమన్వయం సాధించారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో విజయనగరం 2వ పట్టణ సిఐ ఎన్.హెచ్.విజయ ఆనంద్, 2వ పట్టణ ఎస్ఐ షేక్ శంకర్, ప్రధాన పూజారి వెంకటరావు, హుకుంపేట పెద్దలు, యువత, అమ్మవారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


# పంచాయతీలో వీధిదీపాలకు నిధులు కొరత



అనంతగిరి విజయభాను న్యూస్, అనంతగిరి మండలంలోని భీంపోలు పంచాయతీలో భీంపోలు, గ్రామంలో, వీధిదీపాలు లేక చీకటిలో గ్రామమంతా ఉంది చీకటివలన విషపు పురుగులు పాములు, తిరుగుతున్నాయి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది గమనించిన పంచాయతీ ఉపాధ్యక్షుడు మామిడి అప్పలకొండ సహృదయంతో తన సొంతనిధులుతో వీధిదీపాలు వేయిస్తున్నట్లు తెలిపారు,ఇప్పటి కైనా మండల అధికారులు స్పందించి పంచాయతీలోని ఇతర గ్రామాలకు వీధిదీపాలు వేయించవలసినది గా ఆ యా గ్రామాల ప్రజలు కోరుతున్నారు,పంచాయతీ డిడిఓగోపాల కృష్ణ వివరణ, పంచాయతీ లో వీధిలైట్లు కొద్ది రోజులలో వేయిస్తాము, నేను డిడిఓ గా చార్జి కొద్ది రోజుల క్రితమే, తీసుకున్నాను, పంచాయతీ లో వీధిదీపాలు గురించి నాతో ఎవరూ సంప్రదించలేదని డీడీఓ గోపాల కృష్ణ తెలిపారు,

# ఏపీడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులుగా నవీన్ రాజ్ కార్యదర్శిగా లక్ష్మణ్ కోశాధికారి గా అధికార్





కాకినాడ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) కాకినాడ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వాతాడ నవీన్ రాజ్, (స్వతంత్ర్య న్యూస్ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్), కార్యదర్శిగా ముమ్మిడి లక్ష్మణ్ (ప్రజాశక్తి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), కోశాధికారిగా ఎండి అధికార్ లు ఎన్నికయ్యారు. ఫెడరేషన్ కాకినాడ జిల్లా తొలి మహాసభ ఆదివారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర నాయకుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా గత కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణను రూపొం దించారు.

నూతన కమిటీలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్ వివి సత్యనారాయణ (బాబీ) (ఆంధ్రజ్యోతి, కాజులూరు) మీడియా సెక్రెటరీగా పుర్రె త్రినాథ్ (తూర్పు వాణి ఎడిటర్, కాకినాడ), లీగల్ అడ్వైజర్ గా టి. పృథ్వీరాజ్ (కాకినాడ), ఉపాధ్యక్షులుగా నాయుడు (ఆంధ్రజ్యోతి, జగ్గంపేట), జి.శోభన్ బాబు (వార్త, కరప), ఎంవి రమణ (సాక్షి,యు. కొత్తపల్లి), వీధి గోపీనాథ్ ( న్యూస్ ఛానల్, కాకినాడ), బోట్ల లోవరాజు (జన ప్రతిధ్వని, శంఖవరం)

ఆనంద్ (స్వతంత్ర్య, పెద్దాపురం) బిందాన సురేష్ ( ఉదయ అక్షరం, కాకినాడ రూరల్), సహాయ కార్య దర్శులుగా రామకృష్ణ (సాక్షి, ప్రత్తిపాడు), సురేంద్ర (వైఎన్ సీ టివి, పెద్దాపురం), అలమండ ప్రసాద్ (జనస్పందన, సామర్లకోట), ఎస్. మాధవ్ (పెన్ పవర్, ఏలేశ్వరం), కె. సత్య (ఇమేజ్ న్యూస్, పిఠాపురం), గుత్తుల మల్లేశ్వరరావు (ప్రజాశక్తి, తాళ్లరేవు) ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుగా అశోక్ (99 టీవీ, పెద్దాపురం), కొత్తపల్లి రాంబాబు, వి. స్టాలిన్ ( వై న్యూస్, పిఠాపురం), నానాజీ ( స్వతంత్ర్య, కాకినాడ), బత్తిన తాతాజీ (దిశ, శంఖవరం), హసేన్ ( సిటీ కేబుల్, కాకినాడ), మదన్ (డి2, కాకినాడ), ఏ. ప్రసాద్ (ప్రజాభూమి, రౌతులపూడి) లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ఇంత దిగజారుడు రాజకీయాలా..?: శశిథరూర్ అసహనం

దిల్లీ: ఓ మహిళా ప్రజా ప్రతినిధితో ఓ పార్టీలో దిగిన ఫొటోలు ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ చిత్రాలను వైరల్ చేయడాన్ని నీచ రాజకీయాలంటూ ఖండించారు. ఈ మేరకు ఆయన కేరళలోని కొట్టాయంలో మీడియాతో మాట్లాడారు.'ఇవి దిగజారుడు రాజకీయాలు. ఆ ఫొటోలు ఆమె పుట్టినరోజు వేడుకలో దిగినవి. ఆమె నా కంటికి చిన్నపిల్లలా కనిపిస్తుంది. ఆమె నాకంటే 10 నుంచి 20 ఏళ్లు చిన్నది. ఆ వేడుకలో 15 మంది పాల్గొన్నారు. నా సోదరి కూడా అక్కడ ఉంది. కానీ కొందరు దురుద్దేశపూర్వంగా పార్టీకి వచ్చిన మిగతావారిని తొలగించి, అదొక వ్యక్తిగత సమావేశంగా ఫొటోలను వక్రీకరించారు. ఈ ఫొటోలు చూసినవారు ఒక విషయాన్ని గమనించండి. అది రహస్య సమావేశం అయితే.. మరి ఆ ఫొటోలు ఎవరు తీసుంటారు..?

అది ఒక పుట్టినరోజు వేడుక' అని అన్నారు. అలాగే నెట్టింట్లో వస్తోన్న విమర్శలను తాను పట్టించుకోనన్నారు. ప్రజల కోసం పనిచేయడానికి ప్రాముఖ్యత ఇస్తానని థరూర్ చెప్పారు. ఇంతకుముందే ఈ ఫొటోలపై సదరు మహిళా ప్రతినిధి స్పందించారు. 'నాకు తెలుపు రంగు కంటే ఆకుపచ్చ రంగు నచ్చుతుంది. ఎందుకు ఫొటోలను క్రాప్ చేశారు. డిన్నర్‌కు వచ్చిన మిగతావారిని కూడా చూపించండి' అని విమర్శలకు తనదైన శైలిలో బదులిచ్చారు.

# శిక్షణకి ప్రేరణ తొలి విడత బ్యాచ్




రాజాం (విజయభాను న్యూస్) : అఖిలభారత సివిల్ సర్వీసెస్‌కి ఎంపిక కావాలనుకునే వారి కల సాకారం చేయడానికి "శ్రీమతి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ప్రేరణ తొలి విడత బ్యాచ్ శిక్షణ మొదలైంది. ఢిల్లీలో నెక్ట్స్ ఐఏఎస్ అకాడమీలో ఏడుగురు విద్యార్థులు చేరారు. వీరికి అయ్యే శిక్షణ, వసతి ఖర్చులు మొత్తం ట్రస్ట్ భరిస్తోంది. ప్రేరణకి ఎంపికైన మరో ముగ్గురు కోరుకున్న టెస్ట్ సిరీస్ అవకాశం కల్పించారు. మరో ఐదుగురు తమకి మెంటార్ షిప్ కావాలని అభ్యర్థించగా సివిల్ సర్వీసెస్ అధికారులు బృందం ఆధ్వర్యంలో వీరి ప్రిపరేషన్‌కి తగిన గైడెన్స్ అందించనున్నారు. యువత భవితకి చేదోడు, బాలికా విద్యకి చేయూతనందించే బృహత్తర లక్ష్యంతో యువ పారిశ్రామికవేత్త లోలుగు మదన్ తన మాతృమూర్తి స్మృతిలో "శ్రీమతి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ని ఇటీవల ఆరంభించారు. ఈ ట్రస్ట్ ప్రారంభసభలో ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఆర్థిక సహకారం అందించారు. ఇదే సభలో సివిల్ సర్వీసెస్‌కి ఎంపిక కావాలనే ఆశయం ఉన్నవారికి శిక్షణ ఇప్పించే కార్యక్రమం ప్రకటించారు. కేవలం ప్రతిభ కొలమానంగా, టీసీఎస్ నిర్వహించిన టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులకి ఐఏఎస్ అధికారులు, మేధావుల బృందం ఇంటర్వ్యూ చేసి ఈ ఎంపికలు చేపట్టింది. ప్రేరణ పరీక్ష వందలాది మంది రాయగా.. 15 మందిని మెరిట్ ప్రాతిపదికన సెలెక్ట్ చేశారు. ఈ పదిహేను మంది తొలి విడత బ్యాచ్‌కి సుమారు 30 లక్షలతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. ఇలా ఎంపికైన బ్యాచ్ కి నెక్ట్స్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ ఆరంభమైంది. "శ్రీమతి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్" తరపున పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి (ఏ ఒక్క సిఫారసు లేకుండా) పదిమందికి దేశంలో అత్యున్నత శిక్షణా సంస్థలో ఉచితంగా కోచింగ్, వసతి సౌకర్యం కల్పించే ప్రేరణ తొలి బ్యాచ్ శిక్షణకి వెళ్లింది. వచ్చే ఏడాది రెండో బ్యాచ్‌ని ఇదే విధంగా ఎంపిక చేయనున్నారు.మొదటి విడత ఢిల్లీలో పి కార్తీక్-శ్రీకాకుళం , .పీ జోత్స్న-సిగడాం , ఎన్.భ్రమరాంబ-పాలకొండ , జి.ముత్యాల నాయుడు-విశాఖపట్నం ,పి సరిత-సరుబుజ్జిలి ,డి.తిరుపతి-వెంకన్నపేట , డి.చరిష్మా - రాజాం , బి.లావణ్య - విజయనగరం లు కోచింగ్ తీసుకుంటున్నారు.

# అధునాతన ప్రబంధం శమంతకమణి



రాజాం (విజయభాను న్యూస్) : కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత బేతవోలు రామబ్రహ్మ రచించిన శమంతకమణి ప్రబంధం అధునాతన భావాలతో కూడినదని ప్రముఖ సాహితీవేత్త ఒమ్మి రమణ మూర్తి విశ్లేషించి చెప్పారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన రాజాం రచయితల వేదిక 105వ సమావేశంలో ఆయన 'శమంతకమణి-బేతవోలు పద్యబాణి' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేశారు. భాగవతంలోని కొద్ది పద్యాల శమంతకమణి కథను అధునాతన భావాలతో, ఔచిత్యవంతమైన మార్పులతో, చక్కటి ప్రబంధంగా రాశారని ఆయన అన్నారు. ప్రబంధం కవుల పద్ధతిలో రాసినా, చాలాచోట్ల ఆధునిక భావాలను జొప్పించా చారని చెప్పారు. 18 ఏళ్ళు నిండిన బాలికకు పెళ్లి చేయడం, సముద్రుడికి అణుజలాంతర్గామి కొడుకుగా పుట్టడం వంటి ఎన్నో ఆధునికమైన, అభ్యుదయ భావాలను ఈ గ్రంథంలో చూడవచ్చని అన్నారు. ఏకాక్షర కందం వంటి పద్యాలను రాసి తన పాండితీ ప్రతిభను కనబరిచారని చెప్పారు. పద్యకవికి ప్రబంధ రచన కష్టమనుకుంటే, వీరు ఈ పనిని సునాయాసంగా చేశారని చెప్పారు. అనంతరం రమణామూర్తిని ఘనంగా సత్కరించారు. పిల్లా తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, పెంకి దయానిధి నాయుడు, రౌతు గణపతిరావు నాయుడు, తురంగి విశ్వనాథం, బొంతు సూర్యనారాయణ, అంబళ్ళ రామ్మూర్తి, కుదమ తిరుమలరావు, పడాల కవీశ్వరావు, పెంకి చైతన్యకుమార్, వల్లూరు రామినాయుడు, వేగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవికి ఘనంగా పూజలు



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో నవదుర్గామాతకు ఘనంగా పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా బస్టాండ్ ఆవరణలో దుర్గాదేవిని అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజించారు. దేవదాయశాఖ ఈఓ శ్యామలరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుంచి తప్పించాలి

## : రామ్మోహన్ నాయుడు

అమరావతి: శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారిని మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం పుంగనూరులో దుస్తులు విప్పించి అవమానించడం దారుణమని తెదేపా ఎంపీ రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి కుప్పం వరకు సైకిల్ యాత్ర చేస్తుంటే.. అడ్డుకోవడానికి పుంగనూరులో ఏమైనా ప్రత్యేక రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ అరాచకాల వెనకున్న పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ దురాగతంపై ఉత్తరాంధ్ర వైకాపా నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని రామ్మోహన్ నిలదీశారు. "ఉత్తరాంధ్ర నుంచి వెళ్లిన బీసీలను అవమానిస్తే సీఎం జగన్ స్పందించరాఉత్తరాంధ్రులను అవమానించిన



వైకాపా నేతలు రాజధానితో ఉద్ధరిస్తామంటే ఎలా నమ్మాలి? వైకాపా రౌడీ రాజకీయానికి భయపడే.. 2014 ఎన్నికల్లో విశాఖ ప్రజలు విజయమ్మను ఓడించారు. పెద్దిరెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి పార్లమెంట్‌లో నన్ను అవమానించారు. ఇప్పుడు ఆయన తండ్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గంలో అవమానించారు" అని రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు.

# వందే భారత్ ప్రారంభించాక.. భారీగా తగ్గిన విమాన ఛార్జీలు



ఢిల్లీ: దేశంలో రైలు రవాణాను పటిష్ఠ పరచడం వల్ల విమాన ఛార్జీలు భారీగా తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వందే భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చిన తరువాత విమాన ఛార్జీల్లో సగటున 20 నుంచి 30 శాతం తగ్గాయని రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల లింగం, వయస్సు ఆధారంగా వందే భారత్ రైళ్ల డిమాండ్‌ను రైల్వే శాఖ తొలిసారి పర్యవేక్షిస్తోంది. ముంబయి నుంచి ప్రారంభమయ్యే వందే భారత్ లో అత్యధికులు 31-45 ఏళ్ల వయస్సు గలవారే.. ఆ తరువాతి స్థానంలో 15 - 30 ఏళ్ల వయస్కులు ఎక్కువగా ఉంటారు. సెప్టెంబర్ 15 - అక్టోబరు 13 మధ్య ముంబయి నుంచి షిర్డీ, గోవా, షోలాపూర్ వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణాంకాలతో వివరించారు. మొత్తం 85 వేల 600 మంది పురుషులు, 26 మంది ట్రాన్స్‌జెండర్లు, 57 వేల 838 మంది మహిళలు వందేభారత్ లో ప్రయాణించినట్లు చెప్పారు. సెంట్రల్ రైల్వే చీఫ్ పీఆర్ఓ శివరాజ్ మనస్పురే మాట్లాడుతూ.. "వందేభారత్ లో పిల్లల సగటు ఆక్యుపెన్సీ (1-14 సంవత్సరాలు) 5% ఉండగా, 4.5% మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వందే భారత్ రైళ్లు ప్రారంభమైన తర్వాత విమాన రాకపోకలు 10-20% మేర, విమాన ఛార్జీలు 20- 30 శాతం తగ్గాయి" అని అన్నారు. వందేభారత్ రైళ్ల పబ్లిక్ కి తెలియజేసేందుకు, ఫుట్‌పాత్ ల సంఖ్య పెంచడానికి రైల్వే శాఖ మార్గాలను అన్వేషిస్తోందని ఆయన అన్నారు. ముంబై నుండి షిర్డీ, మడ్‌గావ్, షోలాపూర్‌లకు వెళ్లే ఈ వందే భారత్ రైళ్లలో సెప్టెంబర్‌లో 77 - 101 శాతం ఆక్యుపెన్సీ ఉందన్నారు. "ఈ డేటా నాన్-ఫేర్ బాక్స్‌ల నుండి ఆదాయాన్ని సంపాదించడంలో రైల్వే శాఖకు ఉపయోగపడుతుంది. వందే భారత్ రైళ్ల సీట్లు, ట్రేలు, హెడ్ రెస్ట్‌లపై ప్రకటనలు ఇవ్వడం ద్వారా వీటి గురించి ప్రజలకి మరింత అవగాహన కల్పించొచ్చు. రైల్వే శాఖ పర్యవేక్షణ ద్వారా వందే భారత్ లో సేవలు, ఆహార మెనూ, ఇతర సౌకర్యాలలో మరిన్ని మార్పులు చేసి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం"అని పబ్లిక్ పాలసీ అనలిస్ట్ పరేష్ రావల్ అన్నారు.

# నిరాశతో పార్టీకి రాజీనామా చేస్తున్నా : సినీ నటి గౌతమి



చెన్నై : సినీ నటి గౌతమి బిజెపికి రాజీనామా చేశారు. " నిరాశతో పార్టీకి రాజీనామా చేస్తున్నా పార్టీతో పాతికేళ్ల అనుబంధానికి ముగింపు పలుకుతున్నా " అని గౌతమి ప్రకటించారు. పార్టీ నుంచి తనకు ఎలాంటి సహకారం లభించడం లేదని, పైగా ఆర్థిక లావాదేవీల విషయంలో తనను మోసం చేసిన ఓ వ్యక్తికి కొంతమంది సీనియర్లు అండగా నిలిచినట్లు ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా ఓ ప్రకటన పోస్టు చేశారు. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి.. చివరి నిమిషంలో మొండిచెయ్యి చూపించారని కూడా గౌతమి తన రాజీనామా లేఖలో ప్రస్తావించారు. ఇదిలా ఉండగా.. స్థిరాస్తుల విషయంలో అళగప్పన్ అనే వ్యక్తి తనను మోసం చేశారంటూ గత సెప్టెంబరులో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

" దాదాపు 20 ఏళ్ల క్రితం నా పరిస్థితులను ఆసరాగా చేసుకొని అళగప్పన్ అనే వ్యక్తి నమ్మిన బంటులా చేరాడు. అయితే.. డబ్బు, స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్‌ల విషయంలో అతడు నన్ను మోసం చేసినట్లు గుర్తించా. అతడిపై ఫిర్యాదు చేయగా.. కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి 40 రోజులు గడిచినా.. అతడు తప్పించుకు తిరిగేలా పార్టీలోని కొంతమంది సీనియర్ నేతలు సాయం చేస్తున్నారు " అని గౌతమి ఆరోపించారు.

2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజపాళయం నియోజకవర్గంలో పార్టీ అభివఅద్ధి బాధ్యతలను తనకు అప్పగించారని, అక్కడి నుంచి పోటీకి అవకాశం ఇస్తామని కూడా పార్టీ నాయకులు హామీ ఇచ్చారని గౌతమి గుర్తు చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని.. కానీ, చివరి నిమిషంలో టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. అయినప్పటికీ.. పార్టీ పట్ల నిబద్ధతను నిలబెట్టుకున్నట్లు చెప్పారు.

దేశ నిర్మాణంలో తనవంతు సహకారంగా 25 ఏళ్ల క్రితం బిజెపిలో చేరినట్లు గౌతమి పోస్టులో పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో సవాళ్లు ఎదురైనప్పటికీ పార్టీకి కట్టుబడి ఉన్నానన్నారు. ఇలా 25 ఏళ్లపాటు సేవ చేసినా.. పార్టీ నుంచి తనకు మద్దతు లభించడంలేదని గౌతమి వాపోయారు. నిరాశతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనకు న్యాయం చేస్తారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పోలీసు, న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. ఒక ఒంటరి మహిళగా, సింగిల్ పేరెంట్‌గా.. తన కోసం, తన కుమార్తె కోసం పోరాడుతున్నట్లు పేర్కొన్నారు.

# క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో డిసెంబర్ 23 నుంచి

## – చైర్మన్ రాజు



రామ్ నగర్ ( విశాఖ తూర్పు) క్రెడాయ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో 9వ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్ కే ఎస్ ఆర్ కె. రాజు (సాయి) వెల్లడించారు. ఆయన రామ్ నగర్ హోటల్ దశపల్లా ఎక్జిక్యూటివ్ కోర్టులో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. క్రెడాయ్ విశాఖపట్నం ప్రతి సంవత్సరం ప్రాపర్టీ ఎక్స్‌పోలను నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 8 ఎక్స్‌పోలను విజయవంతంగా నిర్వహించింది అని గుర్తు చేశారు. ఇది విశ్వసనీయ పరీక్షించిన సంస్థగా ఖ్యాతిని స్థాపించింది. ఈ భాగాలలో ఇంటి పేరుగా మారింది. ఈ సంవత్సరం డిసెంబర్ 23, 24 , 25 తేదీల్లో 9వ ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహిస్తోంది అన్నారు. ఈ కార్యక్రమం ఎం వి పీ కాలనీ బీచ్ రోడ్ లో గల ఐకానిక్ గాదిరాజు ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుంది అని పేర్కొన్నారు. గృహాల కొనుగోలుదారులు ఈ ఈవెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎక్స్పో సమయంలో చేసిన ఫుట్‌ఫాల్స్ , అక్కడికక్కడే వ్యాపార లావాదేవీల సంఖ్య పెరుగుతూ ఉండటం ద్వారా దీని ప్రజాదరణ స్పష్టంగా కనిపిస్తుంది అని తెలిపారు.

ఎక్స్పో ముఖ్య ఉద్దేశ్యం నిర్మాణ , రియల్ ఎస్టేట్ రంగంలోని వాటాదారులందరినీ ఒకే వేదిక మీదికి తీసుకురావడం, బిల్డర్లు వారి ప్రాజెక్ట్‌లను ప్రదర్శించడం కొనుగోలుదారులకు సహాయం చేయడం, అనేక రకాల ఫ్లాట్లు, విల్లాలు, ప్లాట్లు, నుంచి తన కలల ఇంటిని ఎంపిక చేసుకోవడం. గేటెడ్ కమ్యూనిటీలు మొదలైనవి. ప్రఖ్యాత బిల్డర్లతో పాటు, బిల్డింగ్ మెటీరియల్ నిర్మాణ సామగ్రిని తయారు చేసే ప్రఖ్యాత కంపెనీలు కూడా ఎక్స్‌పోలో పాల్గొంటాయి అని వివరించారు. వివిధ ప్రాజెక్ట్‌లలో ఉపయోగించే మెటీరియల్ నాణ్యతపై సంభావ్య కొనుగోలుదారు అవగాహన కలిగి ఉంటారు. పలు బ్యాంకులు , ఆర్థిక సంస్థలు ముందుగా ఆమోదించబడిన గృహ రుణాలను ప్రాసెస్ చేయడానికి వివిధ ఎంపికలను వివరించడానికి కూడా పాల్గొంటాయి. 'ఆన్ ది స్పాట్ బుకింగ్స్' కోసం ప్రోత్సాహకాలు, ప్రత్యేక డీల్‌లు ఉంటాయి. ఇందులో 80 కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటారు. అసాధారణమైన ధరలలో అసాధారణమైన లక్షణాలను ప్రదర్శిస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద ఎక్స్‌పో అన్నారు. ఇక్కడ ప్రత్యేక ఒప్పందాలను అందిస్తోంది.

అద్భుతమైన రేట్లు అందుబాటులో వుంటాయి అన్నారు. విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు సురక్షితం అన్నారు. కాగా, నవంబర్ ఐదో తేదీన కర్టెన్ రైజర్ కార్యక్రమం మద్రిపాలెం హోటల్ మే రియట్ లో జరుగుతుంది అన్నారు.

విశాఖలో రాజధాని వస్తె రియల్ ఎస్టేట్ రంగం బాగా పుంజుకుంటుంది అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. క్రెడాయ్ అధ్యక్షుడు వి. ధర్మేందర్ మాట్లాడుతూ,

ఫ్లాట్ కొనుగోలులో అవసరం అయిన సలహాలు ఇచ్చేందుకు నిపుణులు అందుబాటులో వుంటారు అన్నారు. గౌరవ కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ, ఇక్కడ సందర్శకులకు నిపుణుల సలహాలు ఎంతగానో ఉపయోగ పడతాయి అన్నారు. మీడియా సమావేశంలో క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆంధ్ర వైద్య కళాశాల వందేళ్ల వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



విశాఖపట్టణం, (విజయభాను న్యూస్): ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా నిర్వహించే వేడుకల ఏర్పాట్లను జీవీఎంసి కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున పరిశీలించారు. ఈనెల 27 28 29 తేదీల్లో జరగనున్న వేడుకలకు ముఖ్యఅతిథిగా భారత ఉప రాష్ట్రపతి, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇతర ప్రముఖులు, ఆంధ్ర ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవుల్లో ఉన్నటువంటి పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్నటువంటి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున నిర్వాహకులకు తగిన సూచనలు జారీ చేశారు. నిర్ణీత కాలంలో పనులను పూర్తి చేసి వేడుకల నిర్వహణ నాటికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కృషి చేసి పర్యటన విజయవంతం చేయాలని చెప్పారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. అశోక్ కుమార్ తదితర వైద్యాధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటివరకు జరిగిన పనుల గురించి ఆరా తీశారు. కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జీవీఎంసీ కమిషనర్, ఆర్డిఓ, ఆంధ్ర వైద్య కళాశాల, కేజీహెచ్ వైద్యాధికారులు, ఇతర విభాగాల అధికారులు తదిరులు ఉన్నారు.



# విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధిలో ప్రసాద్ గార్డెన్స్



శ్రీ శ్రీ చిన్న దుర్గాలమ్మ అమ్మవారి టెంపుల్ దగ్గర శరన్నవరాత్రులు ముగించుకొని ఆలయ వ్యవస్థాపకులు కీర్తిశేషులు గండి బోయిన నూకరాజు వారి కుమార్తెలు మరియు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో సుమారు 1000 మంది భక్తులకు మహాఅన్నదాన%శీ% కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా35 వ వార్డు వైసిపి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు విచ్చేసి ప్రజలందరూ సుఖంగా సంతోషంగా ఆనందంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహానప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యం నివేదించిన పిదప మహా అన్నప్రసాదాన్ని భక్తులందరికీ కూడా తానే స్వయంగా వడ్డించడం జరిగినది కార్యక్రమంలో దుర్గలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ నాయిన మల్లి బాబుధర్మకర్తలు బత్తి మంగరాజు కండి పిల్లి వరలక్ష్మి 35 వార్డు సచివాలయం కన్వీనర్స్ గృహసారథులు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు

## అధిక సంఖ్యలో మెయితీ పోలీస్‌లతో మోహరింపు : మణిపూర్ గిరిజనుల నిరసన

ఇంఫాల్ : మణిపూర్-మయన్మార్ సరిహద్దులో ఉన్న మోరే పట్టణం వద్ద అధిక సంఖ్యలో మెయితీ పోలీసులను మోహరించడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన మహిళలు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. మోరేకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చికిమ్ గ్రామం వద్ద మహిళల నిరసనలు కొనసాగుతున్నాయి. కుకీలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో మెయితీ పోలీసులను అధిక సంఖ్యలో మోహరించడంపై ఆందోళనలు వ్యక్తవుతున్నాయి. మరింత సంఖ్యలో ఇక్కడ పోలీసులు మోహరింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది శాంతికి భంగం కలిగిస్తుందని కుకీ ఇన్ఫి-గిరిజన ఐక్యత కమిటీ (సిఒటియు) ఒక ప్రకటనలో తెలిపింది.

# ఢిల్లీలో క్షీణిస్తున్న వాయు నాణ్యత

## కాలుష్య నిరోధక ప్రణాళిక రెండో దశ ప్రారంభం



న్యూఢిల్లీ : ఢిల్లీ- దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో వాయు నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 2ను అమల్లోకి తీసుకురానుంది. తాజాగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్య పరిస్థితిపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 2 అమలుపై చర్చ జరిగింది. శనివారం నాటికి ఢిల్లీలో 24 గంటల సగటు వాయు నాణ్యత సూచిక (ఎక్యూఐ) 248 పాయింట్లుగా ఉంది. ఈ నెల 23, 24 తేదీల్లో ఢిల్లీ, ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యం మరింత దిగజారుతుందనే అంచనాలు వెలువడ్డాయి. అందువల్ల కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 1 చర్యలతో పాటు స్టేజ్ 2 చర్యలు కూడా తీసుకోవాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. కాలుష్య నివారణ ప్రణాళికలను మొత్తంగా నాలుగు స్టేజ్‌లుగా వర్గీకరించారు. స్టేజ్ 1 - పూర్ (ఎక్యూఐ 201 నుంచి 300), స్టేజ్ 2 -వెరీ పూర్ (ఎక్యూఐ 301 నుంచి 400), స్టేజ్ 3 -తీవ్రం (ఎక్యూఐ 401 నుంచి 450), స్టేజ్ 4- సివియర్ ప్లస్ (ఎక్యూఐ 450 కంటే ఎక్కువ)గా విభజించారు. స్టేజ్ 1లో భాగంగా గాలిలో దూళిని తగ్గించడానికి మార్గదర్శకాలు సక్రమంగా అమలు చేయడం, అక్రమ నిర్మాణాల కూల్చివేత, హోటళ్లు, రెస్టారెంట్లు వద్ద బొగ్గు, కట్టెల వాడకంపై నిషేధాన్ని అమలు చేస్తారు. స్టేజ్ 2లో ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ ఫీజులు పెంచడం, సిఎన్‌జి లేదా ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో సేవలను పెంచడం, వీటి సర్వీసులు పెంచడానికి అదనపు ఫ్లీట్‌లను ప్రవేశపెట్టడం వంటి చర్యలు చేపడతారు. స్టేజ్ 3లో పెట్రోల్, డీజిల్ ఇంజన్లతో నడిచే నాలుగు, అంతకంటే ఎక్కువ చక్రాలు ఉన్న వాహనాలను నిషేధిస్తారు. అనవసరమైన నిర్మాణం, కూల్చివేత పనులనూ నిలిపివేస్తారు. స్టేజ్ 4లో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులనూ నిషేధిస్తారు. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల కోసం వర్క్ ఫ్రం హోం వంటి చర్యలు అమలు చేస్తారు.



దొండపర్తి దేవాదాయ ధర్మదాయ శాఖ శ్రీ శ్రీ శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలోదక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ సారద్యంలో ఆలయ ఈ. ఓ. జి. వి. రామబాయి నెత్రుత్వంలో ధర్మప్రచార వారోత్సవములు ఘనంగా జరుగుతున్నాయిఈరోజుయతిరాజ్ భాగవతార్ వారిచే భక్త కుచేలా హారికథా గానం జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం. వి. రాజశేఖర్ వ్యాఖ్యత వ్యవరించగ ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వర రెడ్డి , ట్రస్ట్ బోర్డు మెంబెర్స్ పిల్లి స్వాతి, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, శరగడ నరసింగ రావు, బి. సూర్యనారాయణ, పి. లక్ష్మి నారాయణమ్మ, పెద్దాడ రవణమ్మ మరియు భక్తులు పాల్గొన్నారు

# వైసీపీ సర్కార్ కి ఇదే ఆఖరి దసరా

**- టిటిడి ఆదాయంలో వాటాను తిరుపతి అభివృద్ధికి ప్రతిపాదన చేయడం కుట్ర**

**- హిందూ ధర్మాన్ని కాపాడాలంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించాలి**

**- రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోంది**

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు కుమార్ రాజు**



సీతమ్మధార (విజయభాను న్యూస్): వైసీపీ ప్రభుత్వానికి ఇదే ఆఖరి దసరా అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు పేర్కొన్నారు. గురుద్వారా వద్ద గల బీజేపీ ఉత్తర నియోజక వర్గం కార్యాలయంలో ఆయన సోమవారం పత్రిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీటీడీ ఈవో సీఎం జగన్ మోహన్ రెడ్డి కి ప్రియ శిష్యుడు అని ప్రజలు భావిస్తున్నారు. అందుకే టిటిడి ఆదాయంలో ఒక శాతం తిరుపతి అభివృద్ధికి ప్రతిపాదన చేయడం పెద్ద కుట్ర అన్నారు. దీంతో బీజేపీ, వి హెచ్ పీ ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రతిపాదన ఆమోదించలేదు అన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడేవారు వచ్చే ఎన్నికల్లో వైసీపీ నీ వొడించాలి అని పిలుపు ఇచ్చారు. పుంగనూరు ఘటన చాలా దురదృష్ట కరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పెద్ది రెడ్డి కి చిత్తూరు జిల్లా సీఎం రాసి ఇచ్చేశారా అని ప్రశ్నించారు.ప్రతి పక్షాలు ఈ దాడి ఖండించాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రౌడీ షీట్ లు ఎత్తేశారు అని గుర్తు చేశారు.ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మాభిమానం దెబ్బ కొట్టారు, కాబట్టి వచ్చే ఎన్నికల్లో వైసీపీ డిపాజిట్లు కోల్పోయేలా చేయాలి అని పిలుపు ఇచ్చారు.రాష్ట్రంలో నియంత పాలన సాగుతుంది అన్నారు.విశాఖలో రాజధాని ఏర్పాటు చేస్తామని అంటూ దోపిడీ చేస్తున్నారు అని ఆరోపించారు.మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ చంద్ర బాబు నాయుడు అరెస్టులో బీజేపీ పాత్ర వుందని చెప్పడం అవివేకం అన్నారు.మంత్రి అమర్నాథ్ స్పందించి 86 ఐటీ కంపెనీలకు రూ.21 కోట్లు ఇన్సెంటివ్ బకాయి చెల్లించాలి అని గుర్తు చేశారు. రుషికొండ ఐటీ కంపెనీలలో 15 వేల మంది ఉద్యోగులు ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవం సమయంలో ఇబ్బంది పడ్డారు అని విచారం వ్యక్తం చేశారు. సీఎం జగన్ పర్యటనల కోసం స్వంత హెలికాప్టర్ కొనుగోలు చేయాలి అని కోరారు. రోడ్లు వేయకుండా హెలిపాడ్లు నిర్మించడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం జగన్ లిక్కర్ మాఫియా ద్వారా దోపిడీ చేస్తున్నారు అని మండి పడ్డారు.



పశ్చిమ శాసనసభ్యులు గణబాబు ఆధ్వర్యంలో 56వ వార్డ్ గవర కంచరపాలెం ఆంజనేయ స్వామి గుడి వద్ద తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా ఆరోగ్యంగా తిరిగి రావాలని కొబ్బరికాయలు కొట్టారు. మరియు గుడి ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మల్ల శంకర్రావు, కాల్ సూరిబాబు , వెంకట్రావు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## కళ ప్రజల కోసం

'ఎన్ని పువ్వులెన్ని రంగులెన్ని సొగసులిచ్చాడు/ అన్నిటిలో నిన్నే చూడమన్నాడు' అంటాడో సినీ కవి. సృష్టిలో ఎన్నో రంగులు, ఎన్నో రూపాలు, ఎన్నెన్నో భావాలు, ఉద్వేగాలు... ఆ రంగుల్లో రూపు కడతాయి. ఎరుపు, పసుపు, నీలాలే కాదు... వాటి నుంచి ఎన్నో వందల, వేల వర్ణాలు ఇంద్రధనుస్సు విరబూసినట్లుగా రూపుదిద్దుకుంటాయి. ఆయా రంగు, రూపాలకి వున్న ఆకర్షణ వీక్షించే దృష్టిని బట్టి, యోచించే మనసును బట్టి వాటిలోని జీవకళ, భావుకత, ఆర్ద్రత మనసును, కళ్ళను కట్టిపడేస్తుంది. అదే... చిత్రకళ. కళ ఏ రూపంలో వున్నా... అది నిత్యజీవన స్రవంతి. ప్రజలను చైతన్యపరుస్తూనే వుంటుంది. సమకాలీన సమాజ స్థితిగతులకు నిలువెత్తు దర్పణం చిత్రకళ. కళా ప్రయోజనం కేవలం ఆనందానికి, సౌందర్యానికే పరిమితం కాదు. హృదయాలను కదిలించి, సమస్యలను ప్రతిబింబించి, ఆలోచనలను రేకెత్తించి... పోరాడే ప్రేరణనిస్తుంది. సమస్యలను చూపడమే కాదు... పరిష్కారాల బాటలు కూడా వేయగలదు. చరిత్రలోని వాస్తవాలను కనుల ముందుకు తీసుకురాగలదు. మానవ అనుభవంలో కళకు చాలా ముఖ్యమైన పాత్ర వుంది. ప్రపంచంలోని మొదటి రికార్డులన్నీ పుస్తకాలలో రాయలేదు. చిత్రాలు, శిల్పాలు, సంగీతం రూపంలోనే నిక్షిప్తం చేయబడ్డాయి. ఇవి గతానికి సంబంధించిన ప్రపంచ చిత్రాన్ని చిత్రించడానికి సహాయపడ్డాయి. మనిషిలో ఆవేశం, ఆర్ద్రత వున్నంతకాలం రసాలూరే భావాలకు కొరత వుండదు.

చిత్రకళ ప్రాచీన నాగరికతకు... ప్రస్తుత కాలానికి మధ్యగల వైరుధ్యాన్ని ప్రతిబింబించే ఒక అందమైన కళాస్రవంతి. వివిధ సంస్కృతులు, సంప్రదాయాల కలయికకు నిలువుటద్దం. ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కనిపించని కథలన్నిటికీ రూపాన్నిచ్చిన ఘనత కళది. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు, ప్రభువెక్కిన పల్లకితో పాటు, అది మోసిన బోయీలు, గనిలో, వనిలో పోరాటాల్లో చిందించిన స్వేదం, పారించిన రుధిరం, హరప్పా, మొహంజొదారో గుహల్లోని చారిత్రక విభాగ సంధ్యల మానవ కథా వికాసాన్ని రూపుకట్టినది– చిత్రం, శిల్పం, సాహిత్యం. మనిషి తన భావాలను, భావనలను వ్యక్తీకరించగలిగిన నాటి నుంచి కళ ఉనికిలోకి వచ్చింది. మట్టిలో లేదా గోడలపై చెక్కబడిన, కళ మానవ నాగరికత ప్రధాన అంశం. ఇది సామాజిక, రాజకీయ ప్రభావాలను తెలియజేయడానికి, వర్ణించడానికి ఉపయోగించిన ప్రధాన మాధ్యమం. బల్బ్ నుంచి వరల్డ్ వైడ్ వెబ్ ఆవిష్కరణ వరకు ప్రపంచ చరిత్రను మలుపు తిప్పి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చినట్లే... పదివేల సంవత్సరాల ఉనికిలో కళ కూడా దాని ఔన్నత్యాన్ని, ఔచిత్యాన్ని ప్రదర్శిస్తూనే వచ్చింది. చరిత్రలోని అనేక ముఖ్యమైన ఘట్టాలు చిత్రం, శిల్పం, ఆట, పాట, మాట ఆవిష్కృతమయ్యాయి.

జీవితపు విలువల్లో మార్పులొస్తున్నా, జీవన విధానాల్లో వైరుధ్యాలు పెరుగుతున్నా... ఆలోచించే మనసు చుట్టూ మాత్రం ఎవ్వరూ అడ్డుగోడలు కట్టలేరు. కళ అంటేనే చైతన్యం. అది నవనవోన్మేషం. స్తబ్దత కళను నిర్వీర్యం చేస్తుంది. ఎప్పటికప్పుడు కళలో కొత్తనీరు వచ్చి చేరుతుండాలి. లేకపోతే, పాత నీరు పాచికట్టి అనారోగ్యానికి దారితీస్తుంది. కళకు ఆ పరిస్థితి రాకుండా ముందుగానే గుర్తించి, కళలో కొత్తదనాన్ని, ప్రజాకోణాన్ని ప్రవేశపెట్టాలి. రూపం ఏదైనా కావొచ్చు. కళ కళ కోసం, కాసుల కోసం కాదు, కళ ప్రజల కోసం, వారి అభ్యున్నతి కోసం అన్న సాంస్కృతికోద్యమ ఆశయాన్ని మరింత ముందుకు తీసుకుపోయి, సమ సమాజ స్థాపన కోసం జరిగే పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించేది కళ. ఈ కళ ప్రపంచంపై చూపిన అద్భుత ప్రభావాన్ని భవిష్యత్తరాలకూ అందించాలి. అనేకానేక సృజనశీలురు తయారయ్యేందుకు ఊతమివ్వాలి. ఆ ఉద్దేశంతోనే అక్టోబర్ 25ను 'అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం'గా పాటించాలని నిర్ణయించారు. సమాజ క్రమాన్ని ప్రజాకోణంలో రంగులద్దగల ప్రతి స్రష్టా వైతాళికుడవుతాడు. 'కాదేదీ కవితకనర్హం' అన్నట్లు– పల్లె సంస్కృతి, రైతు జీవనం, ప్రజా ఉద్యమం, అణచివేత...ఏదైతేనేం, ఈ భావనలకు రూపుదిద్ది, రంగులద్ది చైతన్యాన్ని రగిలిస్తాడు చిత్రకారుడు. కవి, రచయిత, గాయకుడు, శిల్పి... కళ ఏదైనా అది ప్రజా ప్రయోజనం అయినప్పుడు ఆ కళకొక పరమార్థం దక్కుతుంది.

# అధికారులు, సైనికులు 'ప్రచారక్'లా ?

### ఉత్తర్వులను ఉపసంహరించుకోండి : ప్రధాని మోదీకి ఖర్గే లేఖ



న్యూఢిల్లీ : గత తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారం చేసే బాధ్యతలను సీనియర్ అధికారులకు అప్పగిస్తూ ఇటీవల జారీచేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోడీకి ఖర్గే లేఖ రాశారు. ఇలాంటి ఉత్తర్వులు అధికార యంత్రాంగాన్ని 'రాజకీయం' చేయడమే అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 18న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుపై ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లలో కేంద్రం సాధించిన విజయాలను ప్రచారం చేయడానికి జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి ఉన్నత స్థాయి అధికారులను దేశంలోని మొత్తం 765 జిల్లాలకు 'రత్'గా నియమించాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 9న రక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మరొక ఉత్తర్వును కూడా ఖర్గే తన లేఖలో ప్రస్తావించారు. వార్షిక సెలవుల్లో ఉన్న సైనికులు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి తమ సమయాన్ని వినియోగించాలని ఈ ఉత్తర్వుల్లో కోరారు. ఈ విధమైన ఉత్తర్వులు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1964ను స్పష్టంగా ఉల్లంగించడమే అని ఖర్గే తెలిపారు. పైన పేర్కొన్న రూల్స్ ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఎటువంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని నిర్దేశిస్తున్నాయి. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు ప్రభుత్వ అధికారుల్ని అధికార పార్టీ రాజకీయ కార్యకర్తలుగా మారుస్తాయని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రచారానికి ఉన్నతస్థాయి అధికారుల్ని వినియోగిస్తే రాబోయే ఆరు నెలల పాటు దేశ పాలన ఆగిపోతుందని తెలిపారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి పై ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవడం అత్యవసరమని ఖర్గే తన లేఖలో తెలిపారు. ప్రధానికి తాను రాసిన లేఖను ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు దేశంలోని రాజకీయ పార్టీలకు మాత్రమే కాకుండా ప్రజలకు కూడా ఆందోళన కలిగించే విషయంగా ఖర్గే తెలిపారు.

ప్రజాస్వామ్యంలో సాయుధ బలగాలను రాజకీయాలకు దూరంగా ఉంచడం అత్యంత కీలకమని ఖర్గే తెలిపారు. ప్రతి సైనికుడు తన దేశం, రాజ్యాంగం పట్ల విధేయతగా ఉంటారని, ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సైనికులను బలవంతం చేయడం ప్రమాదకరమైన అడుగుగా ఖర్గే విమర్శించారు. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పాటు, ఆదాయపు పన్ను శాఖ, సిబిఐ ఇప్పటికే బిజెపికి ఎన్నికల విభాగాలుగా పనిచేస్తున్నాయి.

పైన పేర్కొన్న ఉత్తర్వులు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అధికార పార్టీకి ఏజెంట్లుగా పనిచేసేలా చేస్తున్నాయి' అని కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

# భారత్ పొరుగున 500 అణు వార్‌హెడ్‌లు

### చైనాపై పెంటగాన్ నివేదిక

వాషింగ్టన్: చైనా సైన్యం భారీగా అణ్వాయుధాలను సమకూర్చుకుంటోందని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ తెలిపింది. 2021తో పోలిస్తే డ్రాగన్ అమ్ములపొదిలోకి 2022లో మరో 100 కొత్త వార్‌హెడ్లు చేరాయని పేర్కొంది. చైనా సైన్యంలో 2022లో జరిగిన అత్యంత కీలకమైన పరిణామాలపై పెంటగాన్ తన నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. చైనా వద్ద ప్రస్తుతం 500 అణు వార్‌హెడ్‌లు వినియోగించడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి సంఖ్య 2030 నాటికి 1,000కి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్‌ఏ) వద్ద 300 ఖండాంతర క్షిపణులు భూగర్భ బొరియల్లో సిద్ధంగా ఉన్నాయి. దేశంలోని మూడు ప్రదేశాల్లో క్షిపణులు మోహరించడానికి వీలుగా భూగర్భ బొరియలను 2022లో నిర్మించింది. సంప్రదాయ వార్‌హెడ్‌లను ప్రయోగించే ఖండాంతర క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలను తీవ్రం చేసింది. విదేశాల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. బర్మా, థాయ్‌లాండ్, ఇండోనేసియా, యూఏఈ, కెన్యా, నైజీరియా, నమీబియా, మొజాంబిక్, బంగ్లాదేశ్, పపువా న్యూగినియా, సాల్మన్ ఐలాండ్స్, తజకిస్థాన్ వంటి చోట్ల



లాజిస్టిక్స్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇక నౌకాదళంలో ఏడాది కాలంలో 30 సరికొత్త యుద్ధనౌకలను చేర్చింది. దీంతో ప్రపంచంలోనే అత్యధికంగా 370 యుద్ధనౌకలు చైనా వద్ద ఉన్నట్లైంది. ఈ సంఖ్య 2025 నాటికి 395.. 2030 నాటికి 435కు పెరగవచ్చు. వాస్తవాధీన రేఖ వద్ద చైనా పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టినట్లు పెంటగాన్ తన నివేదికలో పేర్కొంది. అండర్‌గ్రౌండ్ స్టోరేజీలు, కొత్త రోడ్లు, సైనిక–పౌర వినియోగానికి వీలుగా విమానాశ్రయాలు, భారీ సంఖ్యలో హెలిప్యాడ్లు నిర్మిస్తోందని చెప్పింది. అదే సమయంలో డోక్లాం వద్ద కూడా అండర్‌గ్రౌండ్ స్టోరేజీ సదుపాయాలను ఏర్పాటు చేసింది. పాంగాంగ్ సరస్సుపై రెండో వంతెనతో పాటు.. భూటాన్ సరిహద్దుల్లో వివాదాస్పద ప్రాంతానికి సమీపంలో గ్రామాల నిర్మాణం చేపట్టింది.

# సమకవి సమయం

## 'సర్కార్ – సోగ్గాలు'

ఓరే నాయినా!
ఎక్కడ్రా మీకు చాలలేదు
దాహం-దాహం అని చస్తున్నారు.
ఎక్కడ్రా మీకు చాలలేదు
ఆకలి-ఆకలి అని చస్తున్నారు.
సర్కార్ కొలవున్నోల్లారా!
ఎక్కడ చూసినా! మీరేరా!
సమ్మెలు - నిరాహారదీక్షలు
జీతభత్యాలు చాలవని..! ...ఓరే
మీ బ్రతుకు మాడా!
మీ పొరుగు- ఇరుగోడు
ఎదుటోడు- ప్రక్కోడు
ఎలా బ్రతుకుచున్నారో! .. చూస్తున్నారురా!
అది చాలక - దొడ్డి దారిలో
మీ సంపాదనలు - చేయి చాపడాలు
మీ వెనుక ఎంత తిట్టి పోస్తున్నారో!
ఆలోసించారురా!
అటు చూడండిరా!
కొండ మీద రాళ్లు కొట్టినోళ్లను
ఒక పూట తింటే -ఒక పూట పస్తునోళ్లను
అటు చూడండిరా!
బహు అంతస్తులు నిర్మించే కూలీల,
ఆర్తనాధాలను ...!!ఓరే!!
అటు చూడండిరా!
క్షణం... క్షణం గండంలా గడ్పె
ఆటో కార్మికుల ఆవేదనలను
అటు చూడండిరా!
ప్రైవేట్ సంస్థలలో సగం ఆకలిలో
చస్తున్నోలను
సర్కార్ మడం త్రిప్పిన రోజువస్తే;
దిన కూలీల రేట్లు అధిక మొత్తం పెంచిన రోజువస్తే;
సర్కార్ కొలువులకు ఎగబాకర
కూలి పనులకు పోయినట్లు చేసే రోజువస్తే;
జీతభత్యాలు చాలవని... సర్కార్ కోలవోళ్లు
సమ్మెలు నిరాహారదీక్షలుండబోవు ఏరోజు
...!!ఓరే!!

... రచన : ఎల్ సిద్ధు
సెల్ నెం: 7702977293

# పంచాంగం

దశమి మ. 1.03
ధనిష్ఠ మ. 2.21 వ.రా. 8.58ల 10.26
మంగళవారం 24-10 -2023

**మేషం** : కోళ్ళ, గొఱ్ఱె, పాడి పరిశ్రమ రంగాలలో వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిథునం** : చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బంది ఎదుర్కో వలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదిం పులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరో గ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కాను కలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపు నపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** :భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **మీనం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపార స్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగు మతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

# అరిష్టాలను హరించే అయినవిల్లి గణపతి

# సంకీర్తన





సంపదలకు మహాలక్ష్మిదేవిని, మోక్షానికి పరమశివుడిని, సకల సౌభాగ్యాలకు వైకుంఠవాసుడిని ఇలా ఒక్కో భాగ్యానికి ఒక్కో దేవతను పూజించేకన్నా సర్వసౌభాగ్యాలకు, సకలైశ్వర్యాలకు, సకల సంపదలకు ఆదిదేవుడైన విఘ్నేశ్వరుణ్ణి కొలిస్తేచాలు కోరిన కోరికలు ఇట్టే నెరవేరుతాయి. అలాంటి విఘ్ననాయకుడు సిద్ధి వినాయకుడిగా అయినవిల్లిలో - తూర్పు గోదావరి జిల్లాలో అమల వాపురం పట్టణానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో కోరి కొలువైయ్యాడు.ఈ విఘ్ననాశకుడు కొలువైన ఈ ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక వైభవాలతో పాటుగా పౌరాణిక ప్రశస్తిని కూడా కలిగి ఉంది. ఈ సిద్ధి వినాయ కుడు స్వయంభువు. ఈ ఆలయాన్ని దేవతలందరూ నిర్మించారని, వేదవ్యాస మహర్షి ఈ వినాయ కుడిని ప్రతిష్టించి నట్లు స్థల పురాణం ద్వారా తెలు స్తోంది. మహాభారత యుద్ధా నంతరం వేదవ్యాసుడు దక్షిణదేశ యాత్రలు చేస్తున్నప్పుడు అయిన విల్లి చేరుకున్నారట. అప్పుడిక్కడ సిద్ధి వినాయకుడిని ప్రతిష్టించి పూజలు చేసినట్టు స్థలపురాణం చెప్తోంది. ఈ సిద్ధి వినాయకుణ్ణి దక్ష ప్రజాపతి పూజించినట్లుగా పురాణాలు వెల్లడిస్తున్నాయి. శివుని ఆగ్రహానికి గురైన దక్షప్రజాపతి యాగం వీరభద్రేశ్వరుని వల్ల ఆగిపోయిన తర్వాత

- దక్ష ప్రజాపతి ఇదంతా నేను ముందు విఘ్నేశ్వరుని పూజచేయక పోవడం వల్లే ఇన్ని ఆటంకాలు కలిగాయని విఘ్నేశ్వరుని ముందు పూజించి ఆ తర్వాత యజ్ఞ పరిసమాప్తి చేస్తానని ఈ సిద్ధి వినాయకుడిని పూజించారట. ఇక ఎలాంటి విఘ్నాలు లేకుండా శివునికి అనుగ్రహంతో యాగం పరిసమాప్తి చేసుకొన్నారని పురాణోక్తి. మరికొందరు ఈ వినాయకుడిని స్వయంభువుగా కూడా ఆరాధిస్తారు.

**కొబ్బరికాయతో సంతృప్తి:**

ఇన్ని ప్రశస్తులు కలిగిన ఈ వినాయకుడికి భక్తులు కోరిన కోర్కెలు ఈడేరటానికి కొబ్బరికాయను సమర్పిస్తారు. ఇలా కొబ్బరి కాయను కొట్టడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అయినవిల్లి సిద్ధి వినాయకుడిని ప్రమాణాల వినాయకుడు అనీ మరో ప్రశస్తి కూడా ఉంది. ఈ స్వామి వారి భక్తులు ఈ స్వామిమీద ప్రమాణ చేసి సాక్ష్యం చెప్తే వారికి తిరుగులేని విజయం లభిస్తుంది. ఒకవేళ అబద్ధపు సాక్ష్యం ఎవరైనా చెప్తే ఆదిదేవునికి కోపానికి గురికావాల్సిందేనంటారు అనుభవజ్ఞులు.

**శిల్పసంపద:**

చారిత్రకంగా పరిశీలించినప్పుడు ఈ అయినవిల్లి వినాయకుని ఆలయ ముఖమండపం 1953లో ప్రతిష్టించబడగా 1986లో గర్భాలయ విమాన శిఖరాన్ని పునర్నిర్మించారు. తూర్పు దక్షిణాన ఉన్న గాలిగోపురాలలో 1991లో ఈ ఆలయానికి దక్షిణ గోపురం నిర్మించబడింది. ఇది చాలా ఎత్తుగాను, అరుదైన శిల్పసంపదతో కూడి అత్యంత మనోహరంగా కనిపిస్తుంది.విశాలమైన ఆవరణతో ఎత్తయిన ప్రాకారాలతో శిల్ప కళాశోభితమైన ఈ ఆలయం భక్తులనేకాక పర్యాటకులను కూడా ఆకర్షిస్తోంది. ప్రధాన ద్వారాన్ని దాటుకుని లోనికి ప్రవేశించగానే సుమారు 45 అడుగుల ఎత్తున్న ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయం ముఖమండపం అంతరాళం గర్భాలయాలను కలిగి ఉంది. గర్భాలయంలోని స్వామి మూడు అడుగుల ఎత్తుతో దివ్యమంగళునిగా దర్శనం ఇస్తారు.ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, శ్రీ అన్నాపూర్ణాదేవి, శ్రీవిశ్వేశ్వరస్వామి శ్రీ కాలభైరవ స్వామి ఇలా వీరంతా ఈ ప్రాంగణంలోని ఉపాలయాల్లో కొలువుదీరి వినాయకునితోపాటుగా పూజలందుకుంటూన్నారు. అయినవిల్లి క్షేత్రపాలకుడుగా శ్రీకాలభైరవస్వామి పూజలందుకుంటున్నారు. ముఖమండపం పైన నృత్యగణపతి కొలువుదీరాడు.ఈ సిద్ధివినాయకునికి నిత్య పూజలతోపాటుగా విశేషారాధనలు జరుగుతుంటాయి. ప్రతిరోజు నారికేళ ఫలోదకజలములతో, సప్తనదీ జలాలతోను అభిషేకాలు జరుపుతారు. చవితి తిథులతో పాటుగా ఏకాదశి దశమి తిథుల్లోను ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రీ లక్ష్మి గణపతిహోమం నిర్వహిస్తారు.

ప్రత్యేకంగా రుదక్ర పూజచేస్తారు. గణపతి నవరాత్రులు, భాద్రపద శుక్ల చవితినాడు వార్షికోత్సవాలు ఆరంభించి తొమ్మిదిరోజుల పాటు అంగరంగ వైభోగంగా ఈ స్వామివారికి మహోత్సవాలను నిర్వహిస్తారు.

# జగనన్న ప్రభుత్వంలో అక్కాచెల్లెమ్మలకు ప్రత్యేక స్థానం

- పశ్చిమంలో ఆడారి ఆనంద్ ఆశీర్వదించండి
- దసరా సంబరాలలో 15 వేల మంది మహిళలకు చీరలు, స్వీట్స్ పంపిణీ
- పశ్చిమ నియోజకవర్గం వైకాపా అభ్యర్థిగా ఆడారి ఆనంద్ ను ప్రకటించిన వై వి సుబ్బారెడ్డి







గోపాలపట్నం (విజయభాను న్యూస్): జగనన్న ప్రభుత్వంలో అక్క చెల్లెమ్మలకు ప్రత్యేక స్థానం కల్పించి మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ పేరుగాంచారని వైకాపా రీజనల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి తెలియజేశారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో గల స్థానిక గోపాలపట్నం హై స్కూల్ గ్రౌండ్ నందు నియోజకవర్గం నందు గల అక్క చెల్లెమ్మలతో విజయదశమి సంబరాలను ఏ.పి.ఎం.ఎస్.ఎం. ఈ.డి.సీ చైర్మన్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి వైకాపా రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 15 వేలమంది మహిళలకు, స్వీట్ ప్యాకెట్లు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆడారి ఆనంద్ నాయకత్వంలో పశ్చిమంలో వైకాపా జెండా రెపరెపలాడుతుందని ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో ఆడారి ఆనంద్ ను నియోజకవర్గ ప్రజలంతా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. యువకుడు విద్యావేత్త సంఘ సేవకుడైనటువంటి ఆడారి ఆనంద్ వంటి నాయకుడు తోడుంటే నియోజకవర్గం అభివృద్ధి మరింత జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆడార్ ఆనంద్ మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు గడపగడపకు ప్రభుత్వం జగనన్న కార్యక్రమంలో ప్రజలు చూపిస్తున్న ఆధారభిమానాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా సేవలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే రెహమాన్, వైకాపా సీనియర్ మహిళా నాయకురాలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు పేడాడ రమణి కుమారి,డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్,



కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్చార్జిలు ,క్లస్టర్ ప్రెసిడెంట్లు మరియు ఇన్చార్జులు, అనుబంధ సంఘ చైర్మన్లు మరియు డైరెక్టర్లు ,సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సీనియర్ నాయకులు, యువత, వాలంటీర్లు, అర్జీలు మరియు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.



**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టిరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ.

మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టిరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**


రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి. మలబద్ధకం అనేది అన్ని వ్యాధుల్ని కలిగించడానికి మూలకారణం కాబట్టి ఈ అలవాటు తో మలబద్ధకం నివారించుకుంటే హాయిగా జీవించవచ్చు.

**ఘనమైన రాగి చరిత్ర:**

ఇక రాగి చెంబులో నీళ్ళే ఎందుకు తాగాలి వేరేవి ఉన్నాయి కదా అని కొందరికి సందేహం రావచ్చు . రాగి గురించి వరాహ పురాణంలో వివరంగా ఉంది ఈ రాగి ఏడువేల యుగాల క్రితమే విష్ణు మాయ కారణంగా పుట్టింది .

# యోగాతో అనునిత్యం ఆరోగ్యం

తరుచుగా అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం మూలంగా అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాల మూలంగా శరీరం, వమనసు రెండు కూడా ప్రశాంతంగా ఉంటాయని వారంటున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు ఈ యోగాను చేయడం మూలంగా అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని వారంటున్నారు. యోగాలో భాగంగా ప్రాణాయామం గురించి ఈ వారం తెలుసుకుందాం.



ప్రాణం + ఆయామం = ప్రాణాయామం. ప్రాణమంటే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, ప్రశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్దం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచవచ్చు.

**నియమబద్ధంగా**

నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటి యందు ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాటన్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. కనుకనే ప్రాణాయామేన యుక్తేన సర్వరోగ క్షయ భవేత్'' అంటే ప్రాణాయామం నియమబద్ధంగా ఆచరిస్తే సర్వరోగాలు హరించిపోతాయి అను సూత్రం ప్రచలితం అయింది. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానమను 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థానం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పాచన క్రియకు సమానం, కంఠశక్తికి ఉదానం, రక్తప్రసార క్రియకు వ్యానం తోడ్పడుతాయి.

**రేచకం-పూరకం**

శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయ టకి వదిలి ఆపి ఉంచడాన్ని బాహ్యాకుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్రయోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రాన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూర్య నాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడమ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ట అను అక్షరం సూర్యు డికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగ మంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. హఠం అనగాబలవంతం అనికాదు. ప్రాణాయామ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబంధించినదే.


**ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు...**

1. ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి.
2. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది.
3 . రక్త శుద్ధి జరిగి అందలి చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది.
4 . గుండెకు సత్తువ లభిస్తుంది.
5 . మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
6 . ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి.
8 . శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.
9 . ఆయుష్షు పెరుగుతుంది. ఇది అన్నిటికంటే మించిన విశేషం.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మైదానంలోగాని, తోటలోగాని, తలుపులు తెరచియున్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదేనీ ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి.
- గాలి విపరీతంగా వీస్తూ ఉంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు.- మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయా మం చేయకూడదు.
- సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- పొట్ట నిండుగా ఉన్నపుడు ప్రాణాయామం చేయకూడదు.
- ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళ్తున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు

అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

**స్పృహ తప్పితే...**

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది. గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చూట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.

-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు

-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు -ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

# టెన్షన్ జయించాలంటే ..



ఈ రోజుల్లో పసివాడు మొదలుకొనిపండుముసలి వరకు అందరూ ప్రతిదినం అనేకమార్లు వల్లించే మాట ఇది. ప్రతి దానికీ ఏదో తెలియనిఆందోళన. ఫలితంగా యవ్వన దశలోనేవివిధశారీరక,మానసికరుగ్మతలు.ఆధునిక జీవన విధానంలో సంక్లిష్టత వల్ల ఏర్పడుతున్న దు:స్థితి ఇది. ఒకవైపు సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి, నవ నాగరికత వల్ల ఏర్పాటౌతున్న సుఖభోగాల...ఎన్నిఉన్నాఉద్విగ్నం, బెంగ, దిగులుకొత్త కొత్త తరహాల్లోఎదురౌతున్నాయివీటికి కారణాలేమిటి? పరిష్కారమేమిటి?.. మానసిక స్థైర్యం కొరవడటమే ఈ పరిస్థికి కారణం. నిజానికి దీనికి పరిష్కారం- పూర్తిగా ఆధారపడదగినది - మన పూర్వీకులే మనకు ఇచ్చారు. బాల్యం నుండే పెంచి పోషించుకుంటున్న పోటీ ప్రవృత్తిని ఒకరిని మించి పోవాలనే తాపత్రయం, అన్నిభోగసాధన లు తమకుఅందుబాటులో ఉండాలం ేలాలస... ఈ విధమైన దృక్పథాలవలన అశాంతికి లోనౌతున్నాడు నవీన మానవుడు. ఆధ్యాత్మిక ధార్మిక ఆలోచనారవళినిపెంపొందించు కోవడమే దీనికి పరిష్కారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా వెంటనే ప్రతికూలం (Negative) గా స్పందించకుండా, ప్రశాంతతని కోల్పోకుండా మసలగలిగే అనుకూల (Positive) ధోరణిని అభ్యాసం చేయాలి.

ఎవరు ఆదర్శం?ఈ మానవలోకానికి 'మిశ్ర' లోకం అని పేరు. సుఖదు:ఖ మిశ్రణమే ఇహలోక వైఖరి. ఈ అనుభవాలకి ఎలా స్పందించాలి?

**దు:ఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగత స్పృహ:।**
**వీతరాగ భయక్రోధ: స్థిత నీర్మునిరుచ్యతే ॥**

"దు:ఖంలో మనస్సు ఉద్విగ్నం చెందకుండా, సుఖాలలో అంటుకొని పొంగిపోకుండా, మోహం, క్రోధం, భయం వంటి వికారాలకు లోనుకాకుండా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు'' అని గీతాచార్యుని మాట జ్ఞాని మన:స్థితి 'సంయమనం' 'సమతుల్యం'గా ఉంటుంది. అలాంటి యోగిని మనం ఆదర్శంగా తీసుకొని పురోగమించిడం సుఖజీవన మార్గం. కానీ మనం అధిక సంపన్నుల్నీ, కీర్తిమంతుల్నీ మనకు 'మోడల్స్' గా ఎంచుకుంటాంగానీ, గొప్ప వ్యక్తిత్వాలను ఆదర్శాలుగా భావించం.పైగా మానసిక దృఢత్వమనేది ఏదో ఆధ్యాత్మిక వాదంగా పరిగణిస్తాం గానీ మానవుని వికాస వ్యక్తిత్వంగా లెక్కించం. ఆందోళన ముందువెనుకల్ని ఆలోచించనీయదు. కార్యశీలతకు భంగకరం కూడా. దూరాన వస్తున్న రామలక్ష్మణుల్ని మొదటి సారిగా చూసిన సుగ్రీవుడు విపరీతమైన టెన్షన్‌కి (ఉద్విగ్నానికి) లోనై, అటూ ఇటూ పచార్లు చేస్తుండగా, హనుమంతుడు గమనించి-'' నువ్వు ప్రశాంతతని కోల్పోతే ఏపనీ చేయలేవు. వారిద్దర్నీ చూసి, 'వాలి నీ పైకి పంపిన బలవంతులైన యోధులు' అని నిర్ణయించుకొని భయపడుతున్నావు. కానీ అది రూఢి కాలేదు. ఏమీ తేలకుండానే ఉద్విగ్నపడే మనస్తత్వమున్న వాడు కార్యదక్షుడు కాలేడు'' అని మందలించి, తాను స్వయంగా వెళ్ళి, రామలక్ష్మణుల సమాచారం గ్రహించాడు. వారిని సుగ్రీవునికి మిత్రులుగా చేసి మహోపకారం చేశాడు. కేవలం కథా దృష్టితో చూస్తే -మారీచుడు మాయాజాలంతో రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరచిన ధ్వనికి - వేగిరపడిని సీతమ్మ ఆందోళనే మాటల్లో వర్ణించలేనంత టెన్షన్‌కి గురయింది. ఆ టెన్షనే చికరికి ఆమె అపహరణం వరకు దారితీసింది. భయచకితమైన మానసిక స్థితిలో తీసుకొనే నిర్ణయాలు ప్రమాదాలకి దారితీస్తాయి.

జరగవలసింది జరగకమానదు - అనే ధోరణి ఒక విధంగా మనశ్శాంతినీ, ఊరటనీ ఇస్తుందనేది వాస్తవమే. కానీ ఈ ధోరణి మన ప్రయత్నాన్ని కుంటుపరచదా? అని కొందరి సందేహం. ఏ సిద్ధాంతాన్నైనా ఎలా, ఎంతవరకు స్వీకరించాలి? అనేది మనయుక్తిపై ఆధారపడి ఉంటుంది భారతీయుల కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చక్కని మన:స్థితిని ఏర్పడుతుంది. కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. మన ప్రయత్నం మనం చేసినా తొలగించలేని దానినే ప్రారబ్ధం అంటాం. పురుష ప్రయత్నం తో చేసినదే కదా! ఇది వరకటి కర్మలఫలానికే 'అదృష్టం' 'దైవం' 'భాగ్యం' అని పేరు. ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. ఎవరి 'అదృష్టం' వారిది. అలాగని ప్రయత్నం మానం. ప్రయత్నానికి 'పౌరుషం' అని పేరు. మన ప్రయత్నం దృఢంగా, ఏకాగ్రంగా, పట్టుదలగా ఉంటే అదృష్టాన్ని కూడా మార్చవచ్చు అని శాస్త్రం. 'అదృష్టం ఇంతే' అని సరిపెట్టుకునే స్థితి మనసుకి శాంతినిస్తుంది. పట్టుదలగా కృషి చేసేవాడూ ఆందోళనని ప్రక్కకి పెడతాడు.రెండింటికీ చెందని బలహీనుడే అశాంతి పాలవుతాడు. మన కృషికి తగినదీ, మన అవసరాలను తీర్చేదీ అయిన సంపాదనతో తృప్తిపడడం నేర్చుకోవాలి. పోటీ, ఆందోళన లేకుండా ధర్మబద్ధంగా ప్రయత్నించడానికి సాధన చేయాలి. కొందరు ఎల్లప్పుడూ తామున్న ఉద్యోగం, స్థితి విషయంలో అసంతృప్తి గానే గడుపుతుంటారు. 'గతిలేక అందులో ఉన్నాం' అనే భావన లో ఉంటారు. ఇది కూడా ఒక విధమైన మానసిక రుగ్మతయే. 'ఎవరెక్కడవుండాలో అక్కడేసరిగ్గాఉంచబడ్డారు' (Everyone is rightly placed) అనే ఆంగ్లనానుడి కర్మ సిద్ధాంతానికి దగ్గరిదే.

# మహిషాసురమర్ధిని అవతారంలో రాజశ్యామల



పెందుర్తి(విజయభాను న్యూస్) : విశాఖ శ్రీ శారదాపీఠంలో రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. రాజశ్యామల అమ్మవారు సోమవారం మహిషా సురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చింది. ద్వాదశ భుజాలతో రాక్షస సంహారం చేస్తున్నట్లు అమ్మవారి అలంకరణను తీర్చిదిద్దారు. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్లు ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. మహిషాసురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చిన రాజశ్యామల మాతకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు హారతులిచ్చారు. అనంతరం పీఠం అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారి నిజరూపానికి పంచామృతాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. అంతకుముందు పీఠ ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. అలాగే శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేసారు. రామాయణ వైశిష్ట్యాన్ని టీటీడీ పండితులు డాక్టర్ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి ప్రవచనం ద్వారా వివరించారు. హనుమంతుని జన్మ వృత్తాంతంపై ప్రవచనం సాగింది. వాల్మీకి రామాయణం ఆధారంగా ఆయన ప్రవచనమిచ్చారు. భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర నవావరణార్చన, దేవీ భాగవత పారాయణ నిర్వహించారు. సీనియర్ సినీ నటులు, మాజీ ఎంపీ మురళీమోహన్ విశాఖ శారదాపీఠాన్ని సందర్శించి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. మంగళవారం నిర్వహించే విజయదశమి వేడుకలతో శరన్నవరాత్రి మహోత్సవాలు పూర్తవుతాయి



# స్వరూపానంద ఆశీస్సులు అందుకున్న డిప్యూటీ సీఎం



పెందుర్తి (విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్నారు. దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. మహిషాసురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చిన రాజశ్యామల అమ్మవారి అలంకరణకు పూజలు చేసారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఆయన వెంట అనకాపల్లి ఎంపీ సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ దంపతులు పీఠాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

## హామీ ఇస్తేనే కెనడాకు వీసాలు

### దౌత్యవేత్తల భద్రతే మాకు ముఖ్యం: జైశంకర్

దిల్లీ: కెనడాలో భారత్ దౌత్యవేత్తల భద్రతకు హామీ లభిస్తేనే, ఆ దేశానికి వీసాలు జారీ ప్రక్రియను పునరుద్ధరిస్తామని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. “వీసాల అంశంపై అందరికీ ఆందోళన ఉంది. అయితే మా దౌత్యవేత్తల రక్షణ మాకు కీలకం. కెనడాలో కార్యాలయానికి వెళ్లి అధికారులు వీసాలు మంజూరు చేసే పరిస్థితి లేదు. అందుకే వీసాలను తాత్కాలికంగా నిలిపివేశాం. పరిస్థితులు మెరుగవుతాయని ఆశిస్తున్నాను. దౌత్యవేత్తలకు రక్షణ కల్పించడం వియన్నా ఒడంబడిక ప్రకారం..ప్రాథమిక బాధ్యత. ఆ ప్రాథమిక అంశానికి కెనడాలో సవాల్ ఎదురవుతోంది. పరిస్థితి మెరుగైతే.. వీసాల జారీని మళ్లీ ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తాం. ఇది తొందరగానే జరుగుతుందని భావిస్తున్నా” అని పేర్కొన్నారు. 41 మంది దౌత్యవేత్తలను వెనక్కి తీసుకోమని కెనడాను భారత్ కోరడాన్ని మంత్రి సమర్థించారు.

భారీ సంఖ్యలో ఆ దేశ దౌత్యసిబ్బంది.. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని.. అందుకే వారిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశామని చెప్పారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య సంబంధాలు క్లిష్టదశలో ఉన్నాయని పేర్కొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ

పల్లవి:
కనక వర్ణమున మెరిసిపోయే కనకదుర్గమ్మా
కోరిన కోర్కెలు తీర్చగను సత్వరమే రావమ్మా
నాలుగడుగుల ఎత్తున్న విగ్రహమే నీదమ్మ
ఆగ్రహించక మమ్ములను అనుగ్రహించగ రావమ్మ
చరణం 1:
శూలధారిణివి మహిషాసురమర్ధనివోయమ్మ
అష్ట భుజముల సకలాయుధధారిణివమ్మ
యక్ష భక్తుడగు కీలుడిని కీలాద్రిగ మార్చితివమ్మ
కనకదుర్గగ స్వయంభువువై వెలసితివమ్మ దుర్గమ్మ
చరణం 2:
ఇంద్రుడు మొదలగు దేవతలు కీలాద్రిని దర్శించితిరమ్మ
కీలపర్వతము ఇంద్రకీలముగ
మారిన వైనమిదేనమ్మ
పశుపతి కొరకై అర్జునుడు తపమొనరించినదిక్కడమ్మ
పార్థమధ్యముడు పాశుపతమును పొందిన స్థలమిదేనమ్మ
చరణం 3:
బ్రహ్మాయాగమున పుట్టిన మల్లేశ్వర జ్యోతిర్లింగము
మల్లికా సుమ పూజలతో శ్రీ మల్లేశ్వరమై నిలచెనమ్మ
ఉగ్రరూపిణిగ అవతరించినా శాంతస్వరూపిణివైతివమ్మ
భవానిమాలాధారులచే పూజలగైకొను వరదాయినివి.
చరణం 4:
మల్లికార్జునస్వామి లీలల పుణ్యక్షేత్రమమ్మ
శక్తి మహిమలు కలిగినయట్టి
మహిమాన్వితమౌ ధామమమ్మ
ఆదిశంకరులు శ్రీచక్రముచే ప్రతిష్టి చేసిన శక్తిపీఠము
దసరా నవోత్సవములు వేడుకగ జరిగే దివ్యక్షేత్ర రాజము



- రచన
శ్రీ పల్లి నల్లనయ్య

# మిజోరాం గవర్నర్ కు పిఆర్ఎస్ఐ ఆహ్వానం



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** ప్రభుత్వ, ప్రైవేటు ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాలసంఘం (పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా) ఈ ఏడాది నవంబర్ 25 నుంచి 27వ తేది వరకుదేశ రాజధాని న్యూఢిల్లీ లో నిర్వహించనున్న అంతర్జాతీయ పిఆర్ ఫెస్టివల్ కు ముఖ్య అతిధిగా హజరు కావలసిందిగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు ను ఆహ్వానించింది. ఈ మేరకు విశాఖకు వచ్చిన మిజోరాం గవర్నర్ ను పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పి.ఆర్.ఎస్.ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి, ధక్షిణ భారత ఉపాధ్యక్షుడు యు.ఎస్.శర్మ, పి.ఆర్.ఎస్.ఐ. విశాఖ శాఖ ఉపాధ్యక్షుడు, స్టీల్ ప్లాంట్ కార్పోరేట్కమ్యూనికేషన్ విభాగం అధిపతి శర్మ, కోశాధికారి మరియు గీతం ప్రజాసంబంధాల అధికారి ఎన్.వి.నరసింహం, కార్యవర్గ సభ్యులు, ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి సోమవారం కలిశారు. జి-20 ప్రధాన అంశంగా నిర్వహిస్తున్న సమావేశాలకు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు హజరవుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సమావేశాల ప్రత్యేక పోస్టర్ ను మిజోరాం గవర్నర్ ఆవిష్కరించారు. విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలతో తనకు గల అనుబంధాన్ని, ప్రజా సంబంధాల అధికారుల సహకారాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. పి.ఆర్.ఎస్.ఐ. నిర్విస్తున్న అంతర్జాతీయ పిఆర్ ఫెస్టివల్ 2023విజయవంతం కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## రాజస్తాన్ రాయల్స్ అసిస్టెంట్ కోచ్‌గా షేన్ బాండ్..

ఐపీఎల్-2024 సీజన్‌కు ముందు రాజస్తాన్ రాయల్స్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ పేసర్ షేన్ బాండ్‌ను రాజస్తాన్ ఫ్రాంచైజీ నియమించింది. షేన్ బాండ్ రాజస్తాన్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా మాత్రమే కాకుండా అసిస్టెంట్ కోచ్‌గా కూడా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా రాజస్తాన్ వెల్లడించింది. కాగా షేన్ బాండ్ 9 సీజన్‌ల పాటు ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు. అతడి స్థానంలో శ్రీలంక దిగ్గజం లసిత్ మలింగాను తమ బౌలింగ్ కోచ్‌గా ముంబై నియమించింది. అయితే గత రెండు సీజన్లలో రాజస్తాన్ రాయల్స్ బౌలింగ్ కోచ్‌గా లసిత్ మలింగా పని చేశాడు.

## భారత క్రికెట్ దిగ్గజం బిషన్ సింగ్‌బేడీ (77) ఇక లేరు.

దిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం, టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ బిషన్ సింగ్ బేడీ (77) ఇక లేరు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. తన ఎడమ చేతి వాటం స్పిన్ బౌలింగ్‌తో ఆయన క్రీడాభిమానులకు ఎన్నో చిరస్మరణీయ క్షణాలను అందించారు. బిషన్ సింగ్ బేడీ భారత్ తరఫున 1966 నుంచి 1979 వరకు ఆడారు. 67 టెస్టుల్లో 266 వికెట్లు తీశారు. బిషన్ సింగ్ బేడీ (%దీఱంష్ట్రుఅ ంఱఅస్త్రష్ట దీవసఱఱ%) 22 మ్యాచ్‌లకు కెప్టెన్‌గానూ వ్యవహరించారు. 10 వన్డేల్లో ఆడి 7 వికెట్లు తీశారు. అప్పట్లో భారత్ నుంచి అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా ప్రసిద్ధిగాంచారు. స్పిన్ బౌలింగ్ రివల్యూషన్ రూపశిల్పులలో ఒకరిగా క్రికెట్‌లో తనదైన ముద్ర వేశారు. బిషన్‌సింగ్ బేడీ 1976లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించారు. ఆయనకు భార్య అంజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# రాష్ట్రంలోనే ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన మొదటి పాలిటెక్నిక్ కళాశాల ‘గైస్’

**- ఐఎస్ఓ సర్టిఫికేట్ ను ఆన్ లైన్ లో అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటరమణ**


CERTIFICATE

ZERTIFIKAT ◆ СЕРТИФИКАТ ◆ CERTIFICADO ◆ CERTIFICAT

The Certification Body
of TÜV SÜD South Asia Private Limited
certifies that

Government Institute of Chemical Engineering
Kancharapalem, Near 5th Town Police Station, Industrial Estate Post,
Visakhapatnam – 530 007, Andhrapradesh, India

has implemented Educational Organizations Management System
in accordance with ISO 21001:2018
for the scope of

Providing Educational Services leading to Diploma Programme in Chemical Engineering, Diploma Programme in Chemical Engineering (Petrochemicals), Diploma Programme in Chemical Engineering (Plastics & Polymers) and Diploma Programme in Chemical Engineering (Oil Technology) under State Board of Technical Education & Training, Government of Andhra Pradesh

The certificate is valid from 2023-10-20 until 2026-10-19
Subject to successful completion of annual periodic audits

Certificate Registration No. 99 135 00061
Date of Initial certification: 2023-10-20
Issue Date: 2023-10-20 Rev. 00

Rahul Kale
Head of Certification Body
of TÜV SÜD South Asia Private Limited
Mumbai
Member of TÜV SÜD Group

కంచరపాలెం (విజయభాను న్యూస్) : ప్రతిష్టాత్మకమైన టి.యు.వి.ఎస్.యు.డి సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ వాళు విశాఖపట్నం కంచరపాలెం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల' గైస్' కు ఐ.ఎస్.ఓ 21001:2018 సర్టిఫికెట్ ను అందించారు. రాష్ట్రస్థాయిలో అత్యధిక ఉద్యోగాలు సాధించిన కళాశాలగా ఇటీవల అవార్డు పొందిన ఈ కళాశాల అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సౌకర్యాలు విద్యా విధానం అమలు జరుపుతున్నట్లు ఐఎస్ఓ గుర్తించింది. గతంలో గైస్ కాలేజీని ఐ ఎస్ ఓ బృందం సందర్శించి కళాశాల యొక్క విద్యా ప్రమాణాలు, ఉద్యోగాల సాధన, మౌలిక వసతులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించింది. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గైస్ కు ఐఎస్ఓ సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఈ సర్టిఫికెట్ కళాశాల నందుగల కెమికల్, పెట్రో కెమికల్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ మరియు ఆయిల్ టెక్నాలజీ నాలుగు విభాగాలకు ఈ.ఓ.ఎం.ఎస్ ప్రాసెస్ లో మూడు సంవత్సరాలకు గాను (2023-2026) బహుకరించారు. మన రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మరియు ప్రైవేటు డిప్లమో కళాశాలలన్నింటిలో ఈ గుర్తింపు పొందిన మొదటి కళాశాలగా నిలవడం పై ప్రిన్సిపల్ డాక్టర్ కే.వి రమణ హర్షం వ్యక్తం చేశారు .అదే విధంగా విభాగాధిపతులైన డా బి.వి.లక్ష్మణరావు ని, సిహెచ్ జయప్రకాశ్ రెడ్డి ని ,డాక్టర్ ఎస్ .ప్రశాంతి కుమారి ని, డి.దామోదర్ ని అధ్యాపకులను మరియు అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⁎ Phone : 2564353, Fax : 0891-2569004 ⁎ e-mail: vijayabhanudaily@gmail.com